సాక్షి
మహబూబ్‌నగర్

ఆదివారం । 23 । మార్చి । 2025



కొనసాగుతున్న రెస్క్యూ

ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో కార్మికుల జాడ కోసం రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతుంది.

వివరాలు 8లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-36 (ఆదివారం సాయంత్రం)

సహర్ 4-58 (సోమవారం తెల్లవారుజామున)

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 38.5 /21.3

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. సాయంత్రం వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అనుమానాస్పద వ్యక్తులపై నిఘా పెట్టాలి



మహబూబ్‌నగర్ క్రైం: పదో తరగతి పరీక్ష కేంద్రాల దగ్గర ఎలాంటి సమస్యలు చోటుచేసుకోకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని ఎస్పీ డి.జానకి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. పదో తరగతి పరీక్షల్లో భాగంగా శనివారం పోలీస్ లైన్ హైస్కూల్, అపెక్స్, తక్షశిల ఉన్నత పాఠశాలలను ఎస్పీ పరిశీలించారు. పరీక్షలు సజావుగా జరగడానికి ఎస్పీ భద్రత ఏర్పాట్లను సమీక్షించారు. ట్రాఫిక్ కట్టడి చేయాలని విద్యార్థుల రాకపోకలకు ఆటంకం లేకుండా ట్రాఫిక్‌ను నియంత్రించాలన్నారు. పరీక్ష కేంద్రాల దగ్గర అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. కేంద్రంలోకి విద్యార్థులు, ఇన్విజిలేటర్లు, ఏఎస్‌ఎం సిబ్బంది, పాఠశాల సిబ్బంది కూడా ఫోన్ తీసుకెళ్లడానికి అనుమతి లేదన్నారు. మహిళ పోలీస్ సిబ్బంది అమ్మాయిలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరీక్ష జరుగుతున్న సమయంలో పోలీసులు తప్పక విధుల్లో ఉండాలన్నారు. ఈ తనిఖీల్లో టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్, ట్రాఫిక్‌సీఐ భగవంతురెడ్డి పాల్గొన్నారు.

35 మంది గైర్హాజరు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా పదోతరగతి ఇంగ్లిష్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మొత్తం 60 పరీక్ష కేంద్రాల్లో 12,771 మంది విద్యార్థులకు 12,736 మంది పరీక్షకు హాజరై 35 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. కలెక్టర్ విజయేందిర రెండు, అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్ ఒకటి, డీఈఓ ఒకటి, అసిస్టెంట్ కమిషనర్ మూడు, ఫ్లయింగ్ స్క్వాడ్ 26, అబ్జర్వర్ ఒక పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు.

ఇండోర్ స్టేడియంలో కబడ్డీ సింథటిక్ మ్యాట్లు



మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా యువజన, క్రీడాశాఖకు శనివారం కబడ్డీ సింథటిక్ మ్యాట్లు చేరాయి. 35ఎంఎం సైజు గల 300 మ్యాట్‌లతో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో ఒక కబడ్డీ కోర్టును ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ కబడ్డీ సింథటిక్ మ్యాట్‌లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ నుంచి ఈ సింథటిక్ ట్రాక్‌లు పంపించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ క్రీడల వ్యవహారాల సలహాదారులు ఏపీ జితేందర్‌రెడ్డి కృషితో జిల్లాకు కబడ్డీ సింథటిక్ మ్యాట్‌లు వచ్చినట్లు తెలిపారు. కబడ్డీ మ్యాట్‌పై ప్రాక్టీస్ చేయడం వల్ల జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో పాల్గొనే అవకాశం లభిస్తుందన్నారు.

కల్తీ ఆహారం అందిస్తే చర్యలు తప్పవు



జడ్చర్ల: హోటళ్లు, రెస్టారెంట్లలో నాణ్యతతో కూడిన ఆహారాన్ని అందించాలని కల్తీ ఆహారాన్ని వినియోగదారులకు అందిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా ఆహార భద్రత అధికారి మనోజ్ హెచ్చరించారు. శనివారం జడ్చర్లలోని ఓ ఫుడ్ కోర్టును ఆయన తనిఖీ చేశారు. శుక్రవారం ఫుడ్‌కోర్టులో బిర్యానీ ఆర్డర్ చేయగా అందులో బొద్దింక వచ్చిందటూ ఓ వినియోగదారుడు ఫిర్యాదు చేయగా శనివారం విచారణ చేపట్టారు. హోటల్‌లో ఆహార పదార్థాలు, శుభ్రత, తదితర పారిశుద్ధ్యంపై విచారించారు. మటన్ బిర్యానీ, ముడి పదార్థాల నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించారు. ల్యాబ్ పరీక్షలలో కల్తీ తేలితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. హోటళ్లలో నిబంధనల మేరకు వ్యవహరించాలని, వంటశాలలలో శుభ్రత పాటించాలని తెలిపారు.

ఆ 4 గంటలే కీలకం..

ఉదయం 11.30 గంటల నుంచి 3.30 వరకు ఎండలో తిరగరాదు

- పెరుగుతున్న ఎండల తీవ్రత పట్ల అప్రమత్తంగా ఉండాలి
- చిన్న పిల్లలు, గర్భిణీలు, వృద్ధులు బయటకు రావొద్దు
- ప్రతి పీహెచ్‌సీలో ఓఆర్‌ఎస్ పాకెట్లు అందుబాటులో ఉంచాం
- ఈ మూడు నెలలు ద్రవ పదార్థాలను అధికంగా తీసుకోవాలి
- 'సాక్షి' ఫోన్‌ఇన్ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కృష్ణ



పాలమూరు: జిల్లాలో ఎండల తీవ్రత పెరిగిన నేపథ్యంలో చిన్నారులు, గర్భిణులు, వృద్ధులు ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 వరకు బయటికి రావొద్దని, ఆ నాలుగు గంటలు చాలా కీలకంగా ఉంటాయని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ కృష్ణ సూచించారు. పెరుగుతున్న ఎండల తీవ్రతపై వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు వేసవిలో ఆరోగ్యశాఖ చేపడుతున్న చర్యలపై డీఎంహెచ్‌ఓతో శనివారం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఎండకు తిరిగే వారు ప్రతి గంటకు ఓ సారి నీటిలో ఓఆర్‌ఎస్ కలుపుకొని తాగాలి. కాటన్ దుస్తులు ధరించడం, తలకు టోపీ, లూజ్ షర్ట్స్ వేసుకోవడం ముఖ్యం. ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. రోజువారీ ఆహారంలో తాజా ఆకుకూరలు, కూరగాయలు అధికంగా ఉండాలి. మసాల ఆహారం, నూనె పదార్థాలకు కొంత దూరంగా ఉండాలి. జిల్లాలో ఉన్న పీహెచ్‌సీలకు ఇప్పటికే 1.47 లక్షల ఓఆర్‌ఎస్ పాకెట్లు అందజేశాం. మరో 2.50 లక్షలకు ప్రతిపాదనలు పెట్టాం. ఈ మూడు నెలల కోసం ప్రత్యేక కార్యాచరణ ఏర్పాటు చేసుకుని ఆరోగ్యశాఖ నుంచి వడదెబ్బతో ఇతర ఆరోగ్య సమస్యలపై దృష్టి పెడతాం. ఓఆర్‌ఎస్ అందుబాటులో లేనివాళ్లు ఇంట్లో ఒక లీటర్ నీటిని తీసుకుని అందులో పిడికెడు చక్కెర, చిటికెడు ఉప్పు కలిపిన నీటిని ప్రతి గంటకు ఒకసారి తీసుకోవాలి. వడదెబ్బ మరణాలు ధ్రువీకరించడానికి మెడికల్ ఆఫీసర్, ఎస్‌ఐ, తహసీల్దార్‌లతో కూడిన కమిటీ ఉంటుంది. గతేడాది జిల్లాలో ఎలాంటి వడదెబ్బ మరణాలు చోటుచేసుకోలేదు.' అని పేర్కొన్నారు.

- 'వడదెబ్బకు గురయ్యే బాధితులకు, ఇతర అస్వస్థతకు గురయ్యే వారికి సత్వరమే అందించాల్సిన వైద్యంపై ఇప్పటికే వైద్యాధికారులకు, సిబ్బందికి అవగాహన కల్పించాం. ప్రతి పని ప్రదేశంలో ఓఆర్‌ఎస్, జింక్ అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశాం. వడదెబ్బ తగిలిన వారిని వెంటనే చల్లని ప్రదేశానికి తరలించి గాలి, వెలుతురు బాగా తగిలే విధంగా చూడాలి. ఆ తర్వాత కొంత విశ్రాంతి తీసుకున్న వెంటనే సమీపంలో ఉన్న ఆస్పత్రికి తరలించాలి.' అని డీఎంహెచ్‌ఓ వివరించారు.

సాక్షి ఫోన్ ఇన్

■ ప్రశ్న: ఉపాధి హామీ కూలీలు, దినసరి కూలీలు రోజు వారి పనులలో ఎలాంటి ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలి. కూలీలకు ప్రత్యేకంగా ఓఆర్‌ఎస్ పాకెట్లు అందజేస్తారా?

– నర్సింహులు, ఫీల్డ్ అసిస్టెంట్ బొక్కలోనిపల్లి/ మోహన్‌నాయక్, మహమ్మదాబాద్

■ డీఎంహెచ్‌ఓ: ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద పనులు చేసే వారు చాలా జాగ్రత్తగా ఉండాలి. పనిచేసే స్థలానికి ఉదయం 6 గంటల వరకు చేరుకుని 11 గంటల వరకు పనులు పూర్తి చేసుకోవాలి. ప్రతి గ్రామంలో అంగన్‌వాడీలు, ఆశలు ఓఆర్‌ఎస్ పాకెట్లు అందజేస్తున్నారు. ఎక్కువగా అవసరం అయితే పీహెచ్‌సీల దగ్గరకు వెళ్లి తీసుకొవచ్చు.

■ ప్రశ్న: ఎండలు పెరిగిన క్రమంలో పిల్లలు రాత్రివేళ నిద్రపోకుండా ఏడుస్తున్నారు? చిన్నారుల కోసం ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి. – జహంగీర్ బాబా, సద్దలగుండు

■ డీఎంహెచ్‌ఓ: వేడి గాలుల వల్ల ఉక్కపోత వల్ల నవజాత శిశువులు, చిన్నారులు నిద్ర పోవడానికి ఇబ్బంది పడుతారు. ఈక్రమంలో రాత్రి వేళ ఎక్కువగా ఏడుస్తుంటారు. ఇంట్లోని కిటికీలకు గోనె సంచులు తడిపి వేయాలి. గది స్లాబ్‌పై చల్లని పెయింట్స్ వేసుకోవాలి. తల్లి పాలతో పాటు చిన్నారులకు 50 ఎంఎల్ నీటిని తాగించాలి.

■ ప్రశ్న: వివిధ గ్రామాల నుంచి పాఠశాలలకు వచ్చే విద్యార్థులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.

– లక్ష్మయ్య, రెడ్డిపల్లి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

■ డీఎంహెచ్‌ఓ: ప్రస్తుతం ఒక్కపూట బడులు నడుస్తున్న నేపథ్యంలో మధ్యాహ్నం పాఠశాల వదిలిన తర్వాత విద్యార్థులు నేరుగా ఇళ్లకు చేరుకోవాలి. దూరంగా వెళ్లే వారు టోపీలు లేదా తలపై ఏదైనా వస్త్రం వేసుకోవాలి. ప్రతి విద్యార్థి వెంట వాటర్ బాటిల్ ఉండాలి. ప్రతి గంటకు అర లీటరు నీరు తాగుతుండాలి.

■ ప్రశ్న: కూలీలు వ్యవసాయ పనులు చేస్తుంటే అధిక చెమట రావడంతో పాటు కొంత వడదెబ్బకు గురై మూత్ర విసర్జన కూడా రావడం లేదు. ఇందు కోసం ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి

– కాశీనాథ్‌రెడ్డి, వ్యవసాయదారుడు

■ డీఎంహెచ్‌ఓ: సాధారణంగా ఎండలకు మూత్రం తగ్గడంతో పాటు రంగు కూడా మారుతుంది. రంగు లేత పసుపు రంగు కాకుండా ఇంకా ఎక్కువ పసుపు రంగులో వస్తే తప్పక ఓఆర్‌ఎస్ తాగించాలి. వ్యవసాయ పనులు మధ్యాహ్నం సమయంలో ఏమాత్రం చేయరాదు. అలా చేస్తే శరీరంలో నుంచి చెమట అధికంగా బయటకు వెళ్లి డీహైడ్రేషన్‌కు గురయ్యే అవకాశం ఉంది.

■ ప్రశ్న: ఎండలు పెరుగుతున్న క్రమంలో వృద్ధులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.

– వెంకట్‌రెడ్డి, సల్కర్‌పేట

■ డీఎంహెచ్‌ఓ: ఎండల తీవ్రత పెరగడం వల్ల ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు చిన్నారులు, వృద్ధులు బయటకు రాకుండా ఉండాలి. ఒక వేళ బయటికి వెళ్లాల్సిన సందర్భంలో లూజ్ కాటన్ షర్ట్స్, తలకు టోపి ధరించాలి. ప్రధానంగా రాగి జావ, మజ్జిగ, కొబ్బరి నీళ్లు ఎక్కువగా తీసుకోవాలి.

■ ప్రశ్న: సాధారణంగా రోజు వారీ కూలీ పనులు చేసే వారితో పాటు రైతులు వడదెబ్బ తగలకుండా ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోవాలి. – మల్లు వెంకటేశ్వర్‌రెడ్డి, రైతు, మాచన్‌పల్లి

■ డీఎంహెచ్‌ఓ: రైతులు, కూలీలు ఉదయం 5 గంటల నుంచి 11 గంటలకు పంట పొలాల్లో పనులు పూర్తి చేసుకుని, మళ్లీ సాయంత్రం 4 గంటల తర్వాత చేసుకునే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలి. ఎండలో పనులు చేయడం వల్ల శరీరంలో వేడి ఉష్ణోగ్రతలు పెరిగిపోయి వడదెబ్బ తగిలే అవకాశం ఉంటుంది. వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా పనులు చేసుకోవాలి. ఎండలో పని చేసే వారు కీర దోశ, ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి.

జల వనరులను సంరక్షించుకోవాలి



ప్రపంచ జల వనరుల దినోత్సవం బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయేందిర, ఇతర అధికారులు

- భవిష్యత్‌లో నీటి కోసం యుద్ధాలు జరిగే ప్రమాదం
- అవసరాలకు మించి వాడడం వల్లే భూగర్భ జలాల తగ్గుదల
- కలెక్టర్ విజయేందిర బోయి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జల వనరులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. శనివారం జిల్లా భూగర్భ జలవనరుల శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రపంచ జలవనరుల దినోత్సవం 2025 సందర్భంగా ఎంపీడీఓలు, తహసీల్దార్‌లు, ఎంపీఓలకు నిర్వహించిన వర్క్‌షాప్‌లో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యజీవితంలో నీరు ప్రముఖ పాత్ర పోషిస్తుందని, భూగర్భజలాలు తగ్గడంతో పంటలు ఎండిపోవడం, తాగునీటి సమస్య వస్తుందన్నారు. పూర్వం రాజ్యాధికారం, సామ్రాజ్య విస్తరణ కోసం యుద్ధాలు జరిగేవని, రానున్న రోజుల్లో నీటికోసం యుద్ధాలు వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారని తెలిపారు. భూగర్భ, ఉపరితల జలంను గృహ, వ్యవసాయ, పరిశ్రమలు, వాణిజ్య అవసరాలకు మితిమీరి వాడడం వల్ల భూగర్భ జల మట్టం తగ్గిపోవటానికి కారణం అన్నారు. చెరువులు, కుంటలు నుంచి నీటిని తోడేయడం, ఆటోమేటిక్ స్టార్టర్‌లు వినియోగంతో నీటి వృథా జరుగుతుందన్నారు. నాటిన మొక్కలు సంరక్షించాలని, ప్రతి ఏడాది పాఠశాలల్లో న్యూట్రీ గార్డెన్‌లు, ప్రభుత్వ కార్యాలయాల్లోని ఖాళీ స్థలాల్లో ల్యాండ్ స్కేపింగ్‌తో పచ్చదనం పెంపొందించేలా మొక్కలు పెంచాలన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ మాట్లాడుతూ భూగర్భజలాలు ప్రాధాన్యత గురించి వివరించారు. జిల్లాలో బాలానగర్, మిడ్జిల్, నవాబ్‌పేట, రాజాపూర్ ప్రాంతాల్లో భూగర్భ జలాల వెలికితీత అధికస్థాయిలో ఉందని తెలిపారు. టీజీ వాల్టా 2002 సెక్షన్ 8, సబ్ సెక్షన్ (2) ప్రకారం భూగర్భజల వనరులకు సంబంధించి బోర్లు వేసేందుకు ప్రతి వ్యవసాయ, గృహ యజమాని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఇందుకు గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శికి, పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్‌కి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం ప్రపంచ జలవనరుల దినోత్సవం 2025 బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. జిల్లాలో నీటి సంరక్షణ స్థిరమైన నీటి నిర్వహణలో గణనీయమైన కృషి చేసిన వ్యక్తులు, పాఠశాలలు మరియు కమ్యూనిటీ సమూహాలను గుర్తించి కలెక్టర్ సత్కరించారు. కార్యక్రమంలో భూగర్భ జల వనరుల శాఖ డీడీ రమాదేవి, డీఆర్‌డీఓ నర్సింహులు, డీఎఫ్‌ఓ సత్యనారాయణ, జిల్లా ఉద్యానశాఖ అధికారి వేణుగోపాల్, డీపీఆర్‌ఓ శ్రీనివాస్, భూగర్భ జలశాఖ జియాలజిస్ట్‌లు లావణ్య, ధీరజ్ కుమార్, ద్వారకానాథ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చల్లబడిన పాలమూరు



మూసాపేట మండలం వేములలో ఓ ఇంటి వద్ద వడగండ్లు



హన్వాడలో పడిన వడగండ్లు



రామచంద్రాపూర్‌లో గాలివానకు నేలకొరిగిన చెట్లు

- జిల్లాలో పలు చోట్ల వడగండ్ల వర్షం
- జిల్లాకేంద్రంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

మహబూబ్‌నగర్ (వ్యవసాయం)/మున్సిపాలిటీ/ అడ్డాకుల/ హన్వాడ: జిల్లాలోని పలుచోట్ల శనివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వడగండ్ల వర్షం కురిసింది. దీంతో భానుడి భగభగ, ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు కాస్త ఉపశమనం కలిగింది. హన్వాడ, మహబూబ్‌నగర్ రూరల్, మహబూబ్‌నగర్ అర్బన్, జడ్చర్ల, మూసాపేట, భూత్పూర్, అడ్డాకుల మండలాల్లో రాత్రి ఒక్కసారిగా గాలివానతో వర్షం కురిసింది. కొన్నిచోట్ల వడగండ్లు పడటంతో వరి పంటలు దెబ్బతిన్నాయి. పొట్ట దశలో ఉన్న వరిచేలకు నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ఎండిపోయే దశలో ఉన్న వరితో పాటు ఆయా పంటలకు ఊపిరి పోసినట్లయింది. మహబూబ్‌నగర్ రూరల్ మండలంలో చెట్లు నేలకొరిగాయి. రామచంద్రాపూర్, మాచన్‌పల్లి గ్రామాలలో వడగండ్లతో కూడిన వర్షం కురిసింది. హన్వాడ మండలంలో దాదాపు అరగంట పాటు కురిసిన వర్షంతో రోడ్లు, ఇళ్లపై వడగండ్లు నిండిపోయాయి. మూసాపేట, వేముల, జానంపేట, తాళ్లగడ్డ, కొమిరెడ్డిపల్లి, నిజాలాపూర్, పోలకంపల్లి, చక్రాపూర్ తదితర గ్రామాల్లో వడగండ్లు పడ్డాయి. జిల్లాకేంద్రంలో శనివారం రాత్రి 8:15 గంటల నుంచి 8:30 వరకు ఓ మోస్తారు వర్షం కురిసింది. గాలివానకు రెండు గంటలకు పైగా విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో నగరంలోని ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

కొత్త బడ్జెట్‌కు తుది మెరుగులు

- ఈసారి రూ.154 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాలోని పాలమూరు మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు భూత్పూర్, దేవరకద్ర మున్సిపాలిటీలకు సంబంధించి 2025-26 బడ్జెట్ ముసాయిదాను అధికారులు ఇటీవల రూపొందించారు. తాజాగా వివిధ పద్దులకు సంబంధించి తుది మెరుగులు దిద్దుతున్నారు. ఈ విషయమై శనివారం మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో అకౌంట్స్ విభాగం అధికారులతో ప్రత్యేక అధికారి శివేంద్రప్రతాప్ చర్చించారు. మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు రెండు మున్సిపాలిటీలకు వచ్చే ఆదాయం ఎంత? వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి ఎంతెంత కేటాయించాలి? ఉద్యోగుల జీతభత్యాలు, ఇతర ఖర్చులు ఏమిటనే వాటిపై క్షుణ్ణంగా ఆరా తీశారు. కాగా, ఈసారి మహబూబ్‌నగర్ నగరానికి మొత్తం రూ.154 కోట్ల బడ్జెట్ అంచనాతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు సమాచారం. కార్పొరేషన్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి, ఏఓ ఉమాకాంత్, సీనియర్ అకౌంటెంట్ ఇందిర పాల్గొన్నారు.

■ ఎల్‌ఆర్‌ఎస్‌పై టౌన్ ప్లానింగ్ అధికారులతో ప్రత్యేక అధికారి శివేంద్రప్రతాప్ సమీక్షించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ ఈనెల 31వ తేదీలోగా ప్లాట్ల క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తి కావాలన్నారు. మొత్తం ఫీజు చెల్లింపులో రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న 25 రాయితీని సద్వినియోగం చేసుకునేలా దరఖాస్తుదారులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఏసీపీలు జ్యోత్స్నాదేవి, కరుణాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కందులు క్వింటాల్ రూ.6821

జడ్చర్ల/దేవరకద్ర: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం వేరుశనగకు క్వింటాల్ గరిష్ఠంగా రూ.6,821, కనిష్ఠంగా రూ.5,659 ధరలు లభించాయి. అదేవిధంగా కందులు గరిష్ఠంగా రూ.6,889, కనిష్ఠంగా రూ.6,680, మొక్కజొన్న గరిష్ఠంగా రూ.2,280, కనిష్ఠంగా రూ.2,027, జొన్నలు గరిష్ఠంగా రూ.4,527, కనిష్ఠంగా రూ.4,027, ఆముదాలు గరిష్ఠంగా రూ.6,345, కనిష్ఠంగా రూ.6,225 ధరలు లభించాయి. దేవరకద్ర మార్కెట్ యార్డులో ఆముదాల ధర క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.6,011 ఒకే ధర నమోదైంది. ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యం ధర క్వింటాల్‌కు రూ.1,962గా ఒకే ధర లభించింది. సీజన్ లేకపోవడం వల్ల లావాదేవీలు తక్కువగా జరిగాయి.

మిగిలింది 8 రోజులే..

- ట్రేడ్‌లైసెన్స్ ఫీజు వసూలు అంతంతే
- మహబూబ్‌నగర్ నగరంలో 32.81 శాతమే
- రెన్యూవల్ కింద వచ్చింది 10.02 శాతమే

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాలోని పాలమూరు నగరంతో పాటు జడ్చర్ల, భూత్పూర్ పట్టణాల్లో ట్రేడ్ లైసెన్స్ ఫీజు అంతంత మాత్రంగానే వసూలవుతోంది. వాస్తవానికి నగరాలు, పట్టణాల్లో ఎక్కడైనా ఏదైనా వ్యాపారం నిర్వహించాలంటే నిర్ణీత రుసుం (ఫీజు) చెల్లించి స్థానిక మున్సిపల్ అధికారుల నుంచి ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఏటేటా రెన్యూవల్ చేసుకోవడం తప్పనిసరి. ఎవరికి వారు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించిన తర్వాత అధికారులు సర్టిఫికెట్ అందజేస్తారు. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం 2017 నుంచి సరళీకృత విధానం అందుబాటులోకి తెచ్చింది. ఇందులో భాగంగా మున్సిపల్ కార్యాలయానికి వెళ్లకుండానే ఈ ప్రక్రియ మొత్తం మీ-సేవ ద్వారా నేరుగా పూర్తి చేయవచ్చు. కాగా, జిల్లా కేంద్రంలో 15 వేలకు పైగా వివిధ వ్యాపార, వాణిజ్య, ప్రైవేట్ విద్యాసంస్థలు, ఆస్పత్రులు ఉన్నాయి. అయితే ఆన్‌లైన్‌లో ఐదు వేల లోపు మాత్రమే నమోదు కావడం గమనార్హం. వీటి తనిఖీ, పర్యవేక్షణ బాధ్యతలను మున్సిపాలిటీలోని శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు చూస్తున్నారు. క్షేత్రస్థాయిలో వీరితో పాటు జవాన్లు సైతం ట్రేడ్ లైసెన్స్ ఫీజు వసూలు చేస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగియడానికి కేవలం ఎనిమిది రోజులే గడువు ఉంది. వీరు వసూళ్ల లక్ష్యానికి ఎంతో దూరంలో ఉండటం గమనార్హం.



న్యూటౌన్‌లోని ఓ హోటల్ యజమాని నుంచి ట్రేడ్‌లైసెన్స్ ఫీజు వసూలు చేస్తున్న సిబ్బంది (ఫైల్)

కొత్త విధానం.. వసూళ్లపై ప్రభావం

కొత్త సరళీకృత విధానం అమలులోకి వచ్చాక ఏటా ట్రేడ్‌లైసెన్సు వసూళ్లపై ప్రభావం పడింది. ముఖ్యంగా రెన్యూవల్ చేసుకోవడానికి 11 నెలల ముందుగానే ఏడాదికి సంబంధించిన మొత్తం ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. దీనిని ఆయా సంస్థల యజమానులు, నిర్వాహకులు పట్టించుకోకపోవడంతో పూర్తి స్థాయిలో మున్సిపాలిటీలకు ఆదాయం రావడం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఆర్థిక సంవత్సరం ముగిసే మూడు నెలల ముందు నుంచి ప్రత్యేక దృష్టి సారించాల్సి వస్తోంది.

■ మహబూబ్‌నగర్ నగరంలో 2024-25కు 4,779 సంస్థల నుంచి రూ.82.40 లక్షలు, జరిమానా కింద రూ.23.67 లక్షలతో పాటు పాత బకాయిలు రూ.82.43 లక్షలు, వీటి జరిమానా రూ.41.17 లక్షలు కలిపి మొత్తం రూ.2,29,67,000 రావాలి. అయితే ఇప్పటివరకు 1,538 సంస్థల నుంచి రూ.49.93 లక్షలు, జరిమానా కింద రూ.7.50 లక్షలు, పాత బకాయిల కింద రూ.11.94 లక్షలు, వీటికి సంబంధించి జరిమానా రూ.5.97 లక్షలు కలిపి మొత్తం రూ.75.34 లక్షలు (32.81 శాతం) మాత్రమే వచ్చింది. ఇంకా 3,241 సంస్థల నుంచి రూ.32.47 లక్షలు, జరిమానా కింద రూ.16.17 లక్షలు, పాత బకాయిలు రూ.70.49 లక్షలు, వీటికి సంబంధించి జరిమానా రూ.35.20 లక్షలు కలిపి మొత్తం రూ.1,54,33,000 పెండింగ్‌లోనే ఉంది.

■ ఇక 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను 4,777 సంస్థలు రెన్యూవల్ చేసుకోవాల్సి ఉండగా.. ఇందులో ట్రేడ్ లైసెన్స్ ఫీజు రూ.84.76 లక్షలు, జరిమానా కింద రూ.51.23 లక్షలు, పాత బకాయిల కింద రూ.1.05 కోట్లు కలిపి మొత్తం రూ.2,40,82,000 రావచ్చని మున్సిపల్ అధికారులు అంచనా వేశారు. అయితే ఇప్పటివరకు 263 సంస్థల నుంచి ఫీజు రూ.20.26 లక్షలు, జరిమానా కింద రూ.1.28 లక్షలు, పాత బకాయిల కింద రూ.2.59 లక్షలు కలిపి మొత్తం రూ.24.13లక్షలు మాత్రమే (10.02శాతం) వసూలైంది. ఇంకా 4,514 సంస్థల నుంచి ట్రేడ్ లైసెన్స్ ఫీజు రూ.64.50 లక్షలు, జరిమానా కింద రూ.49.95 లక్షలు, పాత బకాయిలు రూ.1,02,25,000 కలిపి మొత్తం రూ.2,16,70,000 రావాల్సి ఉంది.



సాధ్యమైనంత మేరకు వసూలు

నగరంలోని వివిధ సంస్థల నుంచి ట్రేడ్ లైసెన్స్ ఫీజు రాబట్టడానికి క్షేత్రస్థాయిలో శానిటేషన్ విభాగం అధికారులు, సిబ్బంది తిరుగుతున్నారు. గడువు దగ్గరపడుతున్నందున ఈ వసూళ్లలో వేగం పెంచుతున్నాం. సాధ్యమైనంత మేరకు లక్ష్యం చేరుకోవడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం.

– డి.మహేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, మహబూబ్‌నగర్

జనరల్ ఆస్పత్రి వద్ద ఉద్రిక్తత

- వ్యక్తిగత కారణాలతో విద్యార్థి ఆత్మహత్యాయత్నం
- చికిత్సపొందుతూ మృతి.. వైద్యసిబ్బంది నిర్లక్ష్యమే కారణమని ఆరోపణలు
- ఇంజక్షన్ మార్చి ఇవ్వడం వల్లే చనిపోయాడని ఆస్పత్రి ఎదుట ఆందోళన
- ముగ్గురు ప్రొఫెసర్లతో విచారణ చేయిస్తాం: సూపరింటెండెంట్

– పాలమూరు



- వివరాలు 8లో...

క్లుప్తంగా

పాము కాటుకు మహిళ బలి


లక్ష్మి (ఫైల్)

మరికల్: పాము కాటుకు మహిళ మృతిచెందిన ఘటన శనివారం గాజులయ్యతండాలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గాజులయ్యతండాకు చెందిన డేగవత్ లక్ష్మి పొయ్యి కట్టెల కోసం పొలానికి వెళ్లింది. కట్టెలు కొడుతుండగా ముళ్లపొదలో ఉన్న పాము కాటేసింది. ఆమె అజాగ్రత్త కారణంగా కొద్ది సమయానికి నోట్లో నుంచి నురుగులు వచ్చి అక్కడికక్కడే మృతిచెందింది. సాయంత్రం గమనించిన చుట్టుపక్కల రైతులు ఈవిషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపారు. దిక్కుముక్కు లేని ఈ కుటుంబంలో తల్లి మృతితో ఇద్దరు పిల్లలు అనాథలుగా మారారు. గ్రామస్తులు చందాలు వసూలుచేసి అంత్యక్రియలు నిర్వహించారు.

భవనంపై నుంచి కిందపడి కార్మికుడు మృతి

మహబూబ్‌నగర్ క్రైం: నూతనంగా నిర్మిస్తున్న భవనంపై నుంచి పడి ఓ కార్మికుడు మృతి చెందాడు. రూరల్ ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. గాజులపేటకు చెందిన రమేష్(42) జిల్లాకేంద్రంలోని పాలమూరు యూనివర్సిటీ ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న రెండవ అంతస్తు భవనంలో శుక్రవారం సెంట్రింగ్ బాక్స్ పనులు చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. దీంతో తీవ్రంగా గాయపడిన ఆయనను వెంటనే జనరల్ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ రెఫర్ చేశారు. అక్కడికి తీసుకెళుతున్న సమయంలో మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యులు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం రూరల్ పోలీస్‌స్టేషన్ ఎదుట కొంత సేపు ఆందోళన చేశారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి బలవన్మరణం


మహేష్ (ఫైల్)

కోడేరు: ఉరేసుకొని ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల కేంద్రంలో చోటు చేసుకున్నట్లు ఎస్ఐ గోకారి తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన మహేష్ (30)కు ఆర్థిక ఇబ్బందులు ఉండేవి. ఇంట్లో ఎవరికీ చెప్పకుండా గ్రామశివారులో ఓ చింత చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అటుగా వెళ్తున్న వారు చూసి కుటుంబీకులు, పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనాస్థలికి పోలీసులు చేరుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొల్లాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య పుష్ప, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సంపులో పడి మహిళ మృతి


బాలకిష్టమ్మ (49) (ఫైల్)

కల్వకుర్తి టౌన్: ప్రమాదవశాత్తు ఇంట్లో ఉన్న సంపులో పడి ఓ మహిళ మృతిచెందింది. స్థానికులు తెలిపిన వివరాలు.. సుభాష్‌నగర్ కాలనీకి చెందిన బాలకిష్టమ్మ(49) తన కొడుకుతో కలిసి నిర్మల విద్యాలయం దగ్గర నివాసం ఉంటుంది. శనివారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు జారి నీటి సంపులో పడింది. చుట్టుపక్కల వారు గమనించి వెంటనే బయటకు తీశారు. ఆమె అప్పటికే మృతిచెందింది.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

ఆత్మకూర్: మైనర్ బాలికను వేధింపులకు గురిచేసిన కేసులో యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేందర్ తెలిపారు. వివరాలు.. మండల కేంద్రానికి చెందిన ఓ బాలికతో అదే ప్రాంతానికి చెందిన దండు రవి అనే యువకుడు అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రవిని శనివారం అదుపులోకి తీసుకున్నారు. వనపర్తి కోర్టుకు హాజరుపర్చగా న్యాయమూర్తి 14రోజులు రిమాండ్ విధించారు.

జనరల్ ఆస్పత్రి వద్ద ఉద్రిక్తత

వ్యక్తిగత కారణాలతో విద్యార్థి ఆత్మహత్యాయత్నం

- చికిత్స పొందుతూ మృతి.. వైద్యసిబ్బంది నిర్లక్ష్యమే కారణమని ఆరోపణలు
- ఇంజక్షన్ మార్చి ఇవ్వడం వల్లే చనిపోయాడని ఆస్పత్రి ఎదుట ఆందోళన
- ముగ్గురు ప్రొఫెసర్లతో విచారణ చేయిస్తాం: సూపరింటెండెంట్


యువకులతో మాట్లాడుతున్న డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్, సీఐలు అప్పయ్య, ఇజాజుద్దీన్

మహబూబ్‌నగర్ క్రైం: వ్యక్తిగత కారణాల వల్ల ఆత్మహత్యాయత్నం చేసిన విద్యార్థికి జిల్లా జనరల్ ఆస్పత్రిలో వైద్యసిబ్బంది ఒక ఇంజక్షన్ బదులు మరో ఇంజక్షన్ ఇవ్వడం వల్లే శ్వాసలో ఇబ్బంది ఏర్పడి మృతి చెందాడని కుటుంబసభ్యులు, స్నేహితులు ఆరోపిస్తూ ఆస్పత్రి ఎదుట ఆందోళన నిర్వహించారు. విద్యార్థి సంఘాల నాయకులు అధికంగా రావడంతో కొంత సమయం ఆస్పత్రి ఆవరణలో ఉద్రిక్తంగా మారింది. టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ కథనం ప్రకారం.. జడ్చర్లకు చెందిన రవీంద్ర(23) విద్యార్థి వ్యక్తిగత కారణాల వల్ల శుక్రవారం 11 డోలో 650 ట్యాబ్లెట్స్ వేసుకుని ఆత్మహత్యాయత్నం చేయగా.. కుటుంబసభ్యులు చికిత్స కోసం అదేరోజు రాత్రి 8 గంటల ప్రాంతంలో జనరల్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. అయితే ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం 12.30 ప్రాంతంలో మృతి చెందాడు. చికిత్స చేస్తున్న క్రమంలో అతనికి ఇవ్వాల్సిన ఇంజక్షన్ ఆస్పత్రిలో అందుబాటులో లేకపోవడం వల్ల వైద్యసిబ్బంది బయటకు రాసి ఇవ్వగా.. తీసుకొచ్చి ఇంజక్షన్ ఇవ్వడంతో మృతి చెందాడని కుటుంబసభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళన నిర్వహించారు. ఆ ఇంజక్షన్ వికటించడం వల్లే శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది ఏర్పడి మృతి చెందాడని ఆరోపించారు. విషయం తెలుసుకున్న రవీంద్ర స్నేహితులు, బంధువులు భారీస్థాయిలో ఆస్పత్రి దగ్గర చేరారు. టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్‌తో పాటు వన్‌టౌన్ సీఐ అప్పయ్య ఇతర పోలీసులు ఆస్పత్రికి చేరుకుని గొడవ చేస్తున్న యువకులకు సర్దిచెప్పి అక్కడి నుంచి పంపించారు. మృతుడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. రవీంద్ర మృతిపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తామని, పోస్టుమార్టం తర్వాత మరణంపై అన్ని రకాల విషయాలు తెలుస్తాయని దాని ప్రకారం విచారణ పూర్తి చేస్తామని ఆర్ఎంఓ డాక్టర్ సమత వెల్లడించారు.


రవీంద్ర మృతదేహం

తప్పు చేసినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు

రవీంద్ర మృతి ఘటనపై ముగ్గురు ప్రొఫెసర్లతో కమిటీ ఏర్పాటు చేసి ఈ నెల 24న విచారణ చేయడం జరుగుతుందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్‌కుమార్ సింగ్ 'సాక్షి'కి తెలిపారు. ఈ బృందంలో అనస్తీషియా, గైనిక్, రేడియాలజీ విభాగం హెచ్‌ఓడీలతో కూడిన బృందంతో విచారణ పూర్తి చేయిస్తామని తెలిపారు. ఆ రిపోర్ట్‌తో పాటు కెమికల్ అనాలసిస్, పోస్టుమార్టం రిపోర్ట్ వచ్చిన తర్వాత బాధ్యులపై తప్పక చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ ఘటనలో ఆస్పత్రి సిబ్బంది న్యాక్ అనే ఫెయిన్ కిల్లర్ ఇంజక్షన్ తీసుకురావాలని అటెండర్‌కు చెప్పారని.. అతను మరో స్నేహితుడికి ఫోన్ ద్వారా సమాచారం ఇస్తే అతను చెప్పింది కాకుండా మరో ఇంజక్షన్ తెచ్చినట్లు చెబుతున్నారని దీనిపై విచారణలో తేలుతుందన్నారు. అసలు వైద్యుడి ప్రిస్కిప్షన్ లేకుండా మెడికల్ దుకాణదారుడు ఇంజక్షన్ ఎలా ఇచ్చాడు అనే అంశంపై ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ప్రస్తుతం కారకులను తాత్కాలికంగా సస్పెండ్ చేస్తామని, రిపోర్ట్‌లో వైద్య సిబ్బంది తప్పిదం ఉంటే ఉన్నతాధికారులకు రిపోర్ట్ ఇచ్చి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

టీబీ విభాగంలో పాలమూరుకు మొదటి బహుమతి

రాష్ట్ర స్థాయిలో క్షయ విభాగంలో ఉత్తమసేవలు అందించినందుకు 2024 ఏడాదికి మహబూబ్‌నగర్ జిల్లాకు రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతి లభించింది. శనివారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో మెడికల్ అండ్ హెల్త్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ అనురాధ, రాష్ట్ర క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ రాజేశం చేతులమీదుగా డీఎంహెచ్ఓ డాక్టర్ కృష్ణ, జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ మల్లిఖార్జున్ అవార్డుతో పాటు ప్రశంసాపత్రం అందుకున్నారు. - పాలమూరు


అవార్డు అందుకుంటున్న డీఎంహెచ్ఓ డాక్టర్ కృష్ణ, టీబీ అధికారి మల్లిఖార్జున్

నేడు మహిళా శక్తి పురస్కారాలు ప్రదానం

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణ మహిళా సాహిత్య సాంస్కృతిక సంస్థ, ప్రమీల శక్తిపీఠం సంయుక్త ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్‌లోని భారత్ స్కౌట్స్, గైడ్స్ కార్యాలయంలో ఆదివారం ఉదయం 9 గంటలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు సాహిత్య సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు రావూరి వనజ, జి.శాంతారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అదే వివిధ రంగాల్లో విశేష కృషి చేస్తున్న మహిళలకు 'మహిళా శక్తి పురస్కారాలు' విశ్వావసు నామ ఉగాదిని పురస్కరించుకొని ప్రముఖ సాహితీ వేత్తలకు ఉగాది పురస్కారాలతో సత్కరించనున్నట్లు పేర్కొన్నారు. ప్రముఖ కవయిత్రి చుక్కాయపల్లి శ్రీదేవి సభకు అధ్యక్షత వహిస్తారని, ముఖ్య అతిథులుగా ఉస్మానియా విశ్వవిద్యాలయం పూర్వ తెలుగుశాఖ అధ్యక్షులు ఆచార్య మసన చెన్నప్ప, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ నామోజు బాలాచారి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, ప్రముఖ పద్యకవులు డాక్టర్ నలవోలు నరసింహారెడ్డి, పొద్దుటూరి ఎల్లారెడ్డి హాజరవుతారని తెలిపారు. జిల్లాలోని కవులు, రచయిత్రులు, సాహితీవేత్తలు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

చిచ్చు పెట్టిన స్నాక్స్

- సీనియర్లతో గొడవ
- క్షణికావేశానికి లోనై విద్యార్థిని
- మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం
- రాజాపూర్ కేజీబీవీలో ఘటన
- ఎలాంటి ప్రమాదం లేదన్న వైద్యులు


ఆస్పత్రిలో వివరాలు సేకరిస్తున్న జీసీడీఓ

రాజాపూర్: అనుమతులేకుండా స్నాక్స్ తీసుకున్న విషయంపై ఇరువురు విద్యార్థినుల మధ్య గొడవకు కారణమైంది. క్షణికావేశానికి గురైన ఓ విద్యార్థిని మల్టీవిటయన్ మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన మండలంలోని కేజీబీవీలో చోటుచేసుకుంది. వివరాలు.. కేజీబీవీలో వైష్ణవి ఎనిమిది తరగతి చదువుతోంది. శుక్రవారం సాయంత్రం స్కూల్‌లోని స్టాక్‌రూంలో ఉన్న స్నాక్స్‌ను మరికొందరు విద్యార్థినులతో కలసి అనుమతి లేకుండా తీసుకుంది. ఇది గుర్తించిన 9వ తరగతి క్లాస్‌లీడర్ అనుమతి లేకుండా స్నాక్స్ ఎందుకు దొంగిలించారని మందలించింది. ఈక్రమంలో కొంత వాగ్వాదం కొనసాగటంతో 9వ తరగతి విద్యార్థినులు చేయిచేసుకున్నారు. దీంతో మనస్తాపానికి గురై అందుబాటులో ఉన్న ఐదు మల్టీ విటమిన్ మాత్రలను మింగి ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించింది. గమనించిన సీఆర్‌టి వెంటనే 108 అంబులెన్స్‌కు ఫోన్‌చేసి సమాచారమిచ్చి జడ్చర్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో విద్యార్థిని కోలుకుంటుంది. మాత్రలతో ఎలాంటి ప్రమాదం లేదని డాక్టర్లు తేల్చారు. విద్యార్థిని ఘటన తెలియటంతో జీసీడీఓ రాధ, ఎంఈఓ సుధాకర్ ఆస్పత్రికి చేరుకొని వివరాలు తెలుసుకుని ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారు. ఘటన జరిగిన వెంటనే తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వారు అందుబాటులో లేకపోవటంతో మేనమామ, నానమ్మ ఆస్పత్రికి చేరుకుని విద్యార్థిని వద్ద ఉన్నారు.

నిరంతరం శ్రమిస్తున్న రెస్క్యూ బృందాలు


సొరంగం వద్ద సహాయక బృందాలకు సూచనలు ఇస్తున్న అధికారులు

- గల్లంతైన కార్మికుల ఆచూకీ కోసం 29 రోజులుగా గాలింపు
- ఎస్ఎల్‌బీసీలో కొనసాగుతున్న సహాయక చర్యలు

అచ్చంపేట: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ)సొరంగంలో ప్రమాదవశాత్తు చిక్కుకుపోయిన కార్మికుల జాడా కనుకొనేందుకు అధికార యంత్రాంగం సహాయక చర్యలను మరింత వేగవంతం చేసింది. గత నెల 22న దోమలపెంట ఎస్ఎల్‌బీసీ సొరంగం కుప్పకూలిన ఘటనలో 8 మంది కార్మికులు అందులో చిక్కుకోగా ఈనెల 9న టీబీఎం ఆపరేటర్ గురుప్రీత్‌సింగ్ మృతదేహం గుర్తించారు. మిగిలిన ఏడుగురి కోసం అన్వేషణ కొనసాగుతుంది. ఇంత వరకు వారి ఆచూకీ లభ్యం కాకపోవడంతో కడావర్ డాగ్స్ గుర్తించిన డీ1, డీ2 ప్రదేశాల్లో తవ్వకాలు ముమ్మరం చేశారు. డాగ్స్ పసిగట్టిన ప్రదేశాల్లో 8 నుంచి 10 మీటర్ల పొడవున గోతులు తీస్తూ మట్టిని బయటికి పంపించే పనిలో నిమగ్నమయ్యారు. అత్యంత ప్రమాదకరంగా ఉన్న 40 మీటర్ల వద్దకు చేరుకోవాలంటే మరింత శ్రమించాల్సిన అవసరం ఉంది. కేరళ డాగ్స్ 14 కిలోమీటరు సొరంగం ముందు భాగం 30 మీటర్ల వద్ద కార్మికుల జాడ కనుకొన్నట్లు సమాచారం. అతి క్లిష్టమైన ప్రమాదకరమైన ప్రదేశంలోని మట్టి, రాళ్లు, బురద తొలగింపు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగిస్తే.. మరింత ప్రమాదం జరిగే అవకాశం ఉందని జీఎస్ఐ అధికారులు తేల్చినట్లు తెలిసింది. అయితే ఎంతో జాగ్రత్తగా సహాయక చర్యలు కొనసాగించాలని అధికార యంత్రాంగం భావిస్తోంది. సొరంగం ప్రమాదం జరిగిన చోట చివరి 20 మీటర్ల వద్ద తవ్వకాలు జరిపితే పైకప్పు కూలే అవకాశం ఉండటంతో సింగరేణి రెస్క్యూ బృందాలు టైగర్ కాగ్స్ టింబర్ సపోర్టు ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో మట్టి, రాళ్ల తొలగింపుతో పాటు కార్మికుల గాలింపు చర్యలు ఇంకా మొదలుకాలేదు.

అత్యాధునిక పరికరాలతో..

సొరంగంలోని మట్టి ,బురద, రాళ్లతో నిండిన టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం) భాగాలను దక్షిణ మధ్య రైల్వే సహాయక సిబ్బంది అత్యాధునిక పరికరాలు ఉపయోగించి ప్లాస్మా కట్టర్‌తో ముక్కలు, ముక్కలుగా కట్ చేసి తొలగిస్తున్నారు. తొలగించిన శకలాలను ఇటాచ్ ద్వారా లోకో ట్రైన్, ఎస్కవేటర్ ద్వారా బయటికి తెస్తున్నారు. బయటికి తెచ్చిన శకలాలను క్రేన్ ద్వారా లారీలను నింపుతూ యార్డులకు తరలిస్తున్నారు. సొరంగంలో నిల్వ ఉన్న నీటిని, బురదను వాటర్ జెట్‌ల ద్వారా బయటికి పంపిస్తున్నారు. ఎస్కవేటర్ల ద్వారా కన్వేయర్ బెల్టు ద్వారా మట్టిని బయటికి పంపిస్తున్నారు .సహాయక చర్యల్లో ఎన్‌జీఆర్ఐ జియోగ్రాఫికల్ సర్వే ఆఫ్ ఇండియా, కడావర్ డాగ్స్ బృందం, ర్యాట్ హోల్ మైనర్స్, అన్వి రోబోటిక్ రంగాల నిపుణులు, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, ఆర్మీ, సింగరేణి.. ఇలా 12 రకాల రెస్క్యూ బృందాలు నిరంతరం శ్రమిస్తున్నాయి.

మోనేశ్వర ఆలయంలో చోరీ


చోరీ జరిగిన మోనేశ్వర్ ఆలయం

మక్తల్: పట్టణంలోని రాయచూర్ రోడ్డు సమీపంలో ఉన్న మోనేశ్వర ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోని విగ్రహమూర్తిని, దాదాపు 20 తులాల పంచలోహాల విగ్రహం, 5తులాల వెండి, 5తులాల వినాయకుడి విగ్రహం, హుండీతో పాటు మిగతా వస్తువులను ఎత్తుకెళ్లారు. ఎప్పటిలాగే శనివారం ఉదయం దేవాలయంలో పూజలు చేసేందుకు పూజారి విష్ణుమూర్తి ఆలయం వద్దకు చేరుకున్నారు. లోపలికి వెళ్లిచూసే సరికి వస్తువులు మాయమై ఉండటంతో చోరీ జరిగినట్లు కమిటీ సభ్యులకు తెలిపారు. హుండీని పక్కన పొలాల్లో పడేసి వెళ్లారు. మక్తల్ ఎస్ఐ భాగ్యలక్ష్మిరెడ్డి సమాచారం ఇవ్వగా ఆమె అక్కడికి చేరుకొని పరిశీలించారు. ఆలయ కమిటీ సభ్యులు చోరీ జరిగినట్లు మక్తల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

టీడీసీఏ, ఏవైసీఏ క్రికెట్ టోర్నీకి ఉమ్మడి జిల్లా క్రీడాకారులు


టోర్నీకి ఎంపికైన క్రీడాకారులతో నవీన్‌కుమార్ తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఈనెల 24 నుంచి 31 వరకు శంషాబాద్ తొండుపల్లిలో జరిగే తెలంగాణ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (రూరల్), అమెరికన్ యూత్ క్రికెట్ అకాడమీ అండర్-17 క్రికెట్ టోర్నమెంట్‌కు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు టీడీసీఏ ఉమ్మడి జిల్లా కన్వీనర్ నవీన్‌కుమార్ వెల్లడించారు. శనివారం జిల్లా కేంద్రంలోని బ్రదర్‌హుడ్ క్రికెట్ అకాడమీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అండర్-17 క్రికెట్ టోర్నీకి మహ్మద్ సోహైల్ (షాద్‌నగర్), దక్ష్ పాటిల్ (మహబూబ్‌నగర్), విరాట్‌కుమార్ (భూత్పూర్), సంజునాయక్ (అచ్చంపేట) రవితేజ (వనపర్తి) ఎంపికైనట్లు తెలిపారు. వీరు టీడీసీఏ రూరల్ వారియర్స్ జట్టు తరపున అమెరికన్ జట్టుతో తలపడుతారన్నారు. టీడీసీఏ గ్రామీణ ప్రాంతాల్లో క్రికెట్ క్రీడాకారులను ప్రోత్సహించడానికి టోర్నమెంట్లు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 24న శంషాబాద్ మండలం తొండుపల్లిలోని ఎంపీఎస్ మైదానంలో అండర్-17 క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా పాల్గొంటారని, 31న జరిగే ముగింపు కార్యక్రమానికి కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. టీడీసీఏ రూరల్ వారియర్స్ జట్టు మేనేజర్‌గా శ్రీనివాస్‌రెడ్డి ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్రదర్‌హుడ్ క్రికెట్ అకాడమీ కోచ్ ఎండి. రియాజుద్దీన్, టీడీసీఏ సభ్యులు నవాజ్‌షా, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

భవన నిర్మాణ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): భవన నిర్మాణ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వాలు కుట్రలు పన్నుతున్నాయని టీయూసీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సీ.వెంకటేశ్ అన్నారు. కర్యాదర్శి సి. వెంకటేశ్ అన్నారు. శనివారం స్థానిక సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు తమ హక్కుల సాధన కోసం ఏకం కావాలని అన్నారు. మార్చి 25న మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జరిగే రాష్ట్ర 3వ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. భవన నిర్మాణ కార్మికులు రాష్ట్రంలో దేశంలో తీవ్ర ఇబ్బందులను ఎదురుకొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో 25కోట్లకు పైగా, రాష్ట్రంలో 30 లక్షలకు పైగా నిర్మాణ రంగా కార్మికులు జీవిస్తున్నారని తెలిపారు. అనంతరం మహాసభకు సంబంధించిన పోస్టర్ విడుదల చేశారు. భవన నిర్మాణ, ఇతర కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబశివుడు, టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలు, రాజు, గోవర్ధన్, శేఖర్, ఆంజనేయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీయూసీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేశ్

అజిలాపూర్ లిఫ్ట్‌కు రూ.32.05 కోట్లు మంజూరు


మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో జీఓ కాపీని అందుకుంటున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర: మండలంలోని అజిలాపూర్ లిఫ్ట్‌కు రూ. 32.05 కోట్లు మంజూరు చేస్తూ రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శనివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి జీఓ కాపీని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్నికల హామీ నిలబెట్టుకున్నాం..

ఎన్నికల సందర్భంగా అడవి అజిలాపూర్‌కి సాగునీటిని అందిస్తామని ఎన్నికల వేళ ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నట్లు ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి తెలిపారు. శనివారం రాత్రి స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కోయిల్‌సాగర్ ప్రాజెక్టుకు కూతవేటు దూరంలో ఉన్న అడవి అజిలాపూర్‌కు సాగునీరు అందే పరిస్థితి లేకపోవడం చూసి సాగునీటిని గ్రామానికి తీసుకువస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అజిలాపూర్ ఎత్తిపోతలతో గద్దెగూడెం, వెంకటాయపల్లి గ్రామాలకు సాగునీరు అందుతుందన్నారు. నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తామని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తామన్నారు. టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి అరవింద్‌రెడ్డి పాల్గొన్నారు.

భర్తను హత్య చేసిన భార్యకు రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజేందర్‌రెడ్డి

మరికల్: భూమి అమ్మగా వచ్చిన డబ్బులు తనకు ఇవ్వలేదని భర్తను తాడుతో హత్య చేసిన భార్యను పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రాజేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం మరికల్ సీఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో సీఐ వివరాలు వెల్లడించారు. నర్వ మండలం లంకాలకి చెందిన పాలెం అంజన్న(41) నారాయణపేటలోని చిట్టెం నర్సిరెడ్డి డిగ్రీ కళాశాలల్లో అటెండర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 20న రాత్రి 7గంటల తర్వాత ఇంటికి వచ్చిన భర్త అంజన్నతో భార్య పాలెం రంగమ్మ పొలం విషయంలో గొడవ పడింది. భర్త పేరు మీద ఉన్న ఐదెకరాల భూమిని తనపేరు మీద చేయకుండా అమ్మేశాడు. అమ్మిన డబ్బులు తనకు ఇవ్వలేదని కోపంతో నిద్రిస్తున్న భర్తను అదే రోజు రాత్రి 11 గంటల సమయంలో భర్త మెడకు తాడు బిగించి ఊపిరాడకుండా చేసి హత్యచేసింది. మృతుడి సోదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితురాలిని అదుపులోకి తీసుకొని నారాయణపేట కోర్టుకు రిమాండ్ తరలించినట్లు సీఐ తెలిపారు. నర్వ ఎస్ఐ కుర్మయ్య, తిరుపతిరెడ్డి, రఘు, అజయ్ పాల్గొన్నారు.

జలదోపిడీని ఆపాల్సి ఉంది


మాట్లాడుతున్న పాలమూరు అధ్యయన వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవాచారి

కల్వకుర్తి రూరల్: ప్రజాస్వామిక వాదులు, పెద్దలు, ప్రజాసంఘాలు, అన్ని రాజకీయ పార్టీలు కలసి వచ్చి జలదోపిడీని ఆపాల్సి ఉందని పాలమూరు అధ్యయన వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవాచారి పిలుపునిచ్చారు. శనివారం కల్వకుర్తిలోని యూటీఎఫ్ భవనంలో జలదోపిడీపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. రాఘవాచారితో పాటు ఇరిగేషన్ నిపుణులు రవి హాజరయ్యారు. అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ వెంకట్‌గౌడ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాఘవాచారి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువగా నష్టపోయిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా నష్టపోతూనే ఉండడం బాధాకరమన్నారు. 1956లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పాటయ్యాక నీటి విషయంలో పాలమూరు జిల్లా రైతులకు అన్యాయానికి గురి చేశారని అన్నారు. ప్రస్తుతం పాలమూరు జిల్లాకు దక్కాల్సిన నీటివాటాను ప్రజల కళ్ల ఎదుటే నల్గొండ జిల్లాకు తరలించుకుపోతుంటే అడ్డగించాల్సిన 14మంది ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు నోరు మెదపకపోవడం ఏమిటని రాఘవాచారి ప్రశ్నించారు. జిల్లాలో సాగునీరు లేక ప్రజలు దుర్భరమైన జీవితాలు గడుపుతున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. పాలమూరు జిల్లాకు జరిగిన అన్యాయాన్ని అడ్డుకుందామని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈ అన్యాయాన్ని ఆపాలన్నారు. సమావేశంలో సదానందంగౌడ్, ఆంజనేయులు, పరశురాముడు, బాబీ దేవ్, సీఐటి పరశురాములు, అంజి, రాజేందర్, గోపాల్, సైదులు, బాలయ్య, జంగయ్య పాల్గొన్నారు.